ధరలేక పుచ్చ రైతు విలవిల

- దిగుబడి ఉన్నా ధరల్లేవు
- కిలో రూ.7లకు కొనుగోలు చేస్తున్న దళారులు
- ఖర్చులు కూడా రావడం లేదంటున్న రైతులు


పొలంలోనే వదిలేసిన పుచ్చకాయలు

కోట: పుచ్చకాయలకు ధరలు లేకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. దిగుబడి ఎక్కువగా వచ్చినా ఫలితం లేదని చెబుతున్నారు. గత ఏడాది వేసవిలో టన్ను రూ.17 వేల నుంచి రూ.20 వేల వరకు ధరలు పలికాయి. దీంతో ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు పుచ్చపంటను సాగు చేశారు. గూడూరు నియోజకవర్గంలో సుమారు 1000 ఎకరాల్లో పుచ్చసాగు చేశారు. కోట మండలంలోని గూడలి, తిన్నెలపూడి, చిట్టేడు, కేసవరం, ఊనుగుంటపాళెం, సిద్ధవరం, కొత్తపట్నం, మద్దాలి ప్రాంతాల్లోని ఇసుక, ఎర్రమట్టి నేలల్లో రైతులు పుచ్చసాగు చేపట్టారు. దిగుబడి కూడా బాగా వచ్చింది. ధరలు లేవు. దళారులు కిలో కాయలు రూ.5 నుంచి రూ.7లకు అడుగుతున్నట్లు రైతులు తెలిపారు.

పెరిగిన సాగు ఖర్చులు

రైతులు మల్చింగ్ పద్ధతిలో పుచ్చ సాగు చేపట్టారు. సాధారణ సాగులో ఎకరాకు రూ.40 వేల వరకు ఖర్చు అవుతుండగా మల్చింగ్ పద్ధతిలో సాగుకు రూ.20 వేలు అదనంగా ఖర్చు చేయాల్సి ఉంది. టన్ను రూ.10 వేలు ధర ఉంటే రైతుకు ఊరట లభిస్తుంది. తోటల వద్దకు వస్తున్న దళారులు కాయ సైజును బట్టి రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు అడుగుతున్నారు.

ఎగుమతి లేక పోవడమే..

పుచ్చకాయల ఎగుమతి లేక పోవడంతోనే ధరలు తగ్గినట్లు రైతులు చెబుతున్నారు. సాధారణంగా పచ్చరంగు చారలున్న పెద్ద సైజు పుచ్చకాయలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంటుంది. వీటిని ఇతర రాష్ట్రాలకు తరలించి వ్యాపారం చేస్తారు. ఈ సారి దిగుబడులు బాగా వచ్చినా పెద్దసైజు కాయలకు కూడా ధరల్లేవని రైతులు వాపోతున్నారు. తక్కువ ధరలకు దళారులకు ఇవ్వలేక కొందరు రైతులు ట్రాక్టర్లలో కాయలను లోడ్ చేసుకుని పట్టణాలకు తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు.

నష్టాలు చవిచూడాల్సి వస్తోంది



ఈ ఏడాది పుచ్చకాయలకు ధరలు పతనమవుతాయని ఊహించలేకపోయాం. ప్రస్తుతం దిగుబడి వచ్చినా నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వం చొరవ తీసుకుని పుచ్చరైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి. - సురేంద్ర, గూడలి

పెట్టుబడి కూడా రావడం లేదు



పుచ్చ సాగుకు ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు చేశాం. దిగుబడి బాగా వచ్చింది. ధరలు చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. - సుబ్రమణ్యం, కేసవరం

క్లుప్తంగా

జగన్‌ను కలిసిన కామిరెడ్డి



పెళ్లకూరు: మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి కలిశారు. పెళ్లకూరు మండలంలో పార్టీ పరిస్థితిని వివరించారు. ఆయన వెంట ఓడూరు వినోద్ కుమార్‌రెడ్డి, మల్లాం సురేష్, మునిరాజ ఉన్నారు.

ప్రజాసేవలోనే సంతృప్తి

పెళ్లకూరు : పేదలకు సేవలు అందించడంలో సంతృప్తి ఉందని పారిశ్రామికవేత్త, చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ చాగణం గౌరీశంకర్ తెలిపారు. పెళ్లకూరులోని చాగణం ట్రస్ట్ ప్రాంగణంలో బుధవారం తిరుపతికి చెందిన శ్రీవెంకటేశ్వర అరవింద కంటి ఆస్పత్రి వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వందలాది మంది పేదలకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు, కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సీఈవో సీతారామయ్య, ఏవో కృష్ణ, బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కుంభాభిషేకం


గణపతి హోమం చేస్తున్న వేద పండితులు

చిట్టమూరు : మండలంలోని అరవపాళెం పంచాయతీ పెద్ద దరఖాస్తు గ్రామంలో యల్లశీరమ్మ కుంభాభిషేక వేడుకలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ, విగ్రహాలకు ఫలాభిషేకం చేశారు. యాగశాలలో హోమం చేశారు. ఈ నెల 5వ తేదీ వరకు పూజ లు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

రైతులకు మోటార్ల పంపిణీ

చిల్లకూరు : తీర ప్రాంతంలోని పేద రైతులకు బుధవారం క్రిష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ప్రతినిధులు డ్రిప్ ఇరిగేషన్ మోటార్లు పంపిణీ చేశారు. రైతులు తీర ప్రాంతంలోని ఇసుక భూముల్లో వేరుశనగ సాగు చేస్తున్నారు. పంటలకు డ్రిప్ సిస్టిమ్ ద్వారా నీటిని అందించాల్సి ఉంది. ఈ విషయాన్ని రైతులు ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు కొత్త మోటార్లు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ ప్రాజెక్టు అధికారి సీహెచ్ రమేష్‌బాబు, సర్పంచ్ నెల్లిపూడి సుబ్రహ్మణ్యం, సీఈవో సీహెచ్ వెంకటేశ్వర్లు, కంపెనీ ప్రతినిధులు ఎస్‌కే షఫీ, సాయినాథ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అవమానంపై జెడ్పీ సీఈవోకు ఎంపీటీసీ ఫిర్యాదు


జెడ్పీ సీఈవోకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, ఎంపీటీసీ శ్రీదేవి

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి మండల సర్వసభ్య సమావేశంలో పారవోలు ఎంపీటీసీ పుల్లూరు శ్రీదేవి తనకు జరిగిన అవమానంపై బుధవారం ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో కలిసి నెల్లూరు జెడ్పీ సీఈవో విద్యారమకు ఫిర్యాదు చేశారు. ప్రజా ప్రతినిధినైన తనను అధికారులు, తోటి ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఎంపీడీవో కోటేశ్వరరావు అవమానపరిచారని వాపోయారు. ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సదారెడ్డి, సర్పంచ్ వేణురెడ్డి, మాజీ సర్పంచ్ తిరుమల తదితరులు పాల్గొన్నారు.

అందరికీ నోటీసులు ఇవ్వాలి

దక్కిలి: దక్కిలి పంచాయతీలోని సర్వే నంబరు 255–1లో భూమిని ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్న అందరికీ కాకుండా కొందరికే నోటీసులు ఇచ్చి వేధించడం తగదని డి.మురళీరెడ్డి అనే రైతు తెలిపారు. ఆయన బుధవారం తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ సర్వే నంబరు 255–1లోని మేత పొరంబోకు భూమిని 20 ఏళ్ల క్రితం గ్రామస్తులు సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. కొంతమంది టీడీపీ నాయకులు దురుద్దేశంతో కొంతమందిపైనే ఫిర్యాదులుచేసి వేధిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో నలుగురికి మాత్రమే నోటీసులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. అందరినీ సమానంగా చూడాలన్నారు.

అవ్వాతాతలకు చిన్నారి అప్పగింత


చిన్నారిని అవ్వాతాతలకు అప్పగిస్తున్న సీఐ ఏవీ రమణ

వెంకటగిరి రూరల్ : మద్యం మత్తులో వున్న తండ్రి వదిలి వెళ్లిన చిన్నారిని సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు సీఐ ఏవీ రమణ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన ఏడుకొండలు తన కుమార్తె (10)ను తీసుకుని మంగళవారం వెంకటగిరిలోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు వచ్చాడన్నారు. బాలికను కైవల్యానది సమీపంలోని సినిమా థియేటర్ వద్ద వదిలి మద్యం మత్తులో ఎటో వెళ్లిపోయాడన్నారు. ఎంత సేపటికీ తండ్రి రాకపోవడంతో చిన్నారి ఏడుస్తూ ఉండిపోయిందన్నారు. అక్కడ టిఫిన్ షాపు నిర్వహిస్తున్న వెంకటేష్ దంపతులు చిన్నారిని ఓదార్చి పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. చిన్నారి చెప్పిన అడ్రస్ ఆధారంగా బుచ్చిరెడ్డిపాళెంలోని అవ్వాతాతలను పిలిపించి అప్పగించినట్టు తెలిపారు. చిన్నారిని చేరదీసిన వెంకటేష్‌దంపతులనుసీఐఅభినందించారు.

పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలి


ఎంపీడీవోకి వినతి పత్రం ఇస్తున్న నేతలు

దక్కిలి: గిరిజన మహిళా సర్పంచ్‌ను అవమానపరిచిన దక్కిలి పంచాయతీ కార్యదర్శి కృష్ణ చైతన్యను సస్పెండ్ చేయాలని గిరిజన సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల చెంచు మల్లికార్జునరావు డిమాండ్ చేశారు. ఆయన బుధవారం సర్పంచ్ వేమక్క, ఎంపీటీసీ మెలకల వెంకటరమణమ్మ, నాయకులతో కలిసి ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ సర్పంచ్ వేమక్కకు తెలియకుండానే సమావేశాలు నిర్వహించడంతోపాటు అగౌరవంగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోకుంటే పోరాటాలు ఉద్ధృతం చేస్తామని తెలిపారు. అనంతరం ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎంపీడీవో మాట్లాడుతూ పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎలుగోటి రేవతి, రాములమ్మ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

శ్మశానానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి

నాయుడుపేట టౌన్ : తుమ్మూరు శ్మశానవాటికకు నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ స్థానికులు డిమాండ్ చేశారు. వారు బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ దాతలు రూ.కోటికి పైగా ఖర్చు చేసి శ్మశానవాటికకు అభివృద్ధి చేశారని తెలిపారు. నీరు, విద్యుత్ వసతి కల్పించాలని ఎనిమిది నెలలుగా కోరుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సన్నారెడ్డి రాజారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, దువ్వూరు సుబ్రమణ్యంరెడ్డి, పాలూరు నాగయ్య, రమణయ్య, సన్నారెడ్డి భాస్కర్‌రెడ్డి, అన్నాడి శెట్టి ఉదయ్ కుమార్, ఈతముక్కల రామకృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై నిగ్గు తేల్చాలి


కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న సంఘ సభ్యులు

గూడూరు రూరల్ : పాస్టర్ ప్రవీణ్ మృతిపై నిగ్గు తేల్చాలని గూడూరు ఎస్ఏఎల్‌సీ సెయింట్ పాల్ పీటర్స్ లూథరన్ చర్చి సభ్యులు డిమాండ్ చేశారు. వారు బుధవారం రాత్రి గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ పాస్టర్ మృతిపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కాపరి రెవరెండ్ ప్రవీణ్‌రాజ్, సంఘ చైర్మన్ రాజయ్య, పీసీ, ఎల్‌సీసీ సభ్యులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

సైదాపురం : అనంతమడుగు దళితవాడలో స్వయంకృషి రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను బుధవారం ఎంపీటీసీ లేబాక వెంకటరమణయ్య ప్రారంభించారు. సొసైటీ డైరెక్టర్ శ్రీలత మాట్లాడుతూ పేదలకు సురక్షితమైన తాగునీరు అందించడమే తమ సంస్థ ధ్యేయమన్నారు. సర్పంచ్ లేబాక కుమారి, హైటెక్ శ్రీను, మల్లికార్జున, స్వాతి పాల్గొన్నారు.

చిన్నతనంలోనే గుర్తిస్తే ఆటిజానికి చెక్

చిల్లకూరు/దక్కిలి : పిల్లల్లోని ఆటిజం లక్షణాలను చిన్నతనంలోనే గుర్తించి చికిత్స అందిస్తే మంచి ఫలితాలు ఉంటాయని పారిచెర్లవారిపాళెం, దక్కిలి హెచ్‌ఎంలు చంద్రశేఖర్, నాగరాజు తెలిపారు. పాఠశాలల్లో బుధవారం చిన్నారులు, వారి తల్లిదండ్రులకు ఆటిజంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆటిజం లక్షణాలు ఉన్న చిన్నారులు కొంతమందినే ఇష్టపడతారని తెలిపారు. ఒంటరిగా ఉంటారని తెలిపారు. వారితో ఎక్కువ సేపు గడుపుతూ వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలన్నారు. అప్పుడే వారు ఆ వ్యాధి నుంచి త్వరగా బయటపడతారని వివరించారు.

మృతుడు తమిళనాడు వాసి

చిల్లకూరు : మండలంలోని వరగలి క్రాస్ రోడ్డు వద్ద సోమవారం మృతి చెందిన వ్యక్తి తమిళనాడు వాసిగా గుర్తించారు. వరగలి క్రాస్ రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్టు సాక్షి దినపత్రికలో బుధవారం కథనం ప్రచురితమైంది. దీన్ని చూసిన కుటుంబ సభ్యులు పోలీసులను సంప్రదించి అతను తమిళనాడు ప్రాంతానికి చెందిన ఆర్ముగం (48)మని తెలిపారు. అతను ఆరు నెలల క్రితం గూడూరులో బాడుగ ఇల్లు తీసుకుని వ్యాపారం చేసుకుంటున్నాడని తెలిపారు. ఈ క్రమంలో అతను మృతి చెంది ఉంటాడని తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లికి అప్పగించినట్టు పోలీసులు తెలిపారు.

వెలుగు సిబ్బందిపై చర్యలేవీ..?

రాపూరు: వెలుగు కార్యాలయంలో నిధులు స్వాహా చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకోకపోవడంపై ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దల మునెయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ వెలుగులో రూ.1.41 కోట్ల నిధుల గోల్‌మాల్ జరిగినట్టు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. దీంతో 9 మంది డీఆర్‌డీఏ సిబ్బందిపై విచారణకు ఆదేశించారని తెలిపారు. యానాది సమాఖ్య, మహిళా సమాఖ్యలో విచారణ జరిపి ఏడుగురు సిబ్బంది అవినీతికి పాల్పడినట్లు డీఆర్‌డీఏ పీడీకి నివేదిక అందించినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు.

అనుబంధ కమిటీలతో పార్టీ బలోపేతం


నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిల్లకూరు : అనుబంధ కమిటీల ద్వారా ప్రజల మధ్యే ఉంటూ వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయడానికి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్టు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. ఆయన బుధవారం గూడూరు సనత్‌నగర్‌లోని తన నివాసంలో అనుబంధ కమిటీల ఎంపికపై నాయకులతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో క్షేత్ర స్థాయిలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందన్నారు. క్షేత్ర స్థాయిలో అనుబంధ కమిటీలు ఏర్పాటు చేసి మరింత బలోపేత చేస్తామన్నారు. కమిటీల్లో మహిళలకు పెద్ద పీట వేయనున్నట్టు వివరించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో కార్యకర్తలకు మనోధైర్యం కల్పించేలా ప్రతి సోమవారమూ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పార్లమెంటులో ప్రవేశ పెట్టిన ముస్లింల వ్యతిరేక బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వడం శోచనీయమన్నారు. గతంలో దివంగత నేత వైస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు ఇచ్చిన విషయం గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సైతం ముస్లిం సంక్షేమానికి అనేక చర్యలు తీసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మగ్దూమ్ మొహిద్దీన్, నాయకులు సృజనరెడ్డి, ఆదూరు రత్నం, పూర్ణచంద్ర, జోగి వినోద్, మహేంద్ర, అన్నం మురళి, ప్రేమ్, శివకుమార్, అక్బర్, సుబ్రహ్మణ్యం, జలీల్, సుభాన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ


సముద్ర తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తున్న విద్యార్థులు

చిట్టమూరు/వాకాడు : పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మీనాకుమారి తెలిపారు. పాఠశాలకు చెందిన లవింగ్ స్కౌట్స్ విద్యార్థులు బుధవారం పర్యావరణం పరిరక్షణలో భాగంగా ఓడపాళెం సముద్ర తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించారు. బీచ్‌లో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, వ్యర్థాలు వేయడం వల్ల కలిగే అనర్థాలపై పర్యాటకులకు అవగాహన కల్పించారు. లైట్ హౌస్ కాలనీ మహిళలకు వ్యక్తిగత శుభ్రత, బాలికా విద్య ప్రాముఖ్యతను వివరించారు. స్కౌట్ మాస్టర్ పిడుగు భరత్ మహీపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు నేదురుమల్లి రాక

వెంకటగిరి (సైదాపురం) : వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం వెంకటగిరిలోని తన నివాసానికి రానున్నారు. ఆయన సాయంత్రం 4 గంటల నుంచి కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

నేడు, రేపు ఆధార్ క్యాంపులు

బాలాయపల్లి (సైదాపురం) : బాలాయపల్లి మండలంలోని పిగిలాం, వెంగమాంబపురం, కామకూరు, కయ్యూరు సచివాలయాల్లో గురు, శుక్రవారాలు ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వినీల్‌కుమార్ తెలిపారు. ఆధార్ కార్డులో సవరణలతోపాటు పిల్లలకు ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ లింకింగ్ తదితర సేవలు చేపడతామని తెలిపారు.

6న పెంచలకోనలో శ్రీరామ నవమి

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం శ్రీవారి అలంకార మండపంలో స్నపన తిరుమంజనం, కల్యాణోత్సవం, సాయంత్రం హనుమంత సేవ ఉంటాయని తెలిపారు.

అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

చిట్టమూరు: రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారుల తీరుపై గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ గంతలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను ఆన్‌లైన్ చేసి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. ఇప్పుడు వచ్చిన సమస్యలైనా పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాల్లో విద్యుత్ వినియోగ దారుల నుంచి నగదు వసూలు చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, తీరుమార్చుకోకుంటే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీవో మనోహర్ గౌడ్, వాకాడు సీఐ హుస్సేన్ బాషా, ఆర్‌డబ్ల్యూస్ డీఈ నందకుమార్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

చిల్లకూరు : ఉపాధి నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నట్టు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన బుధవారం తొణుకుమాల పంచాయతీలో రూ.30 లక్షల ఉపాధి నిధులతో పనులను ప్రారంభించారు. ఉపాధి పనుల ప్రారంభంపై సమాచారం ఇవ్వకపోవడంపై ఎంపీటీసీ ఎల్లసిరి జానకిరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ పాటించకపోడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. దీనిపై ఎంపీడీవో గోపిని వివరణ కోరగా ప్రోటోకాల్ విషయం ఏపీడీ, ఏపీవోలు చూసుకోవాల్సి ఉందని తెలిపారు.

పూజ సామగ్రి వితరణ

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని అమీర్‌షావలీ దర్గాలో దూపహారతులు ఇచ్చేందుకు పూజ సామగ్రిని బుధవారం సుల్తాన్, హుస్సేన్ కుటుంబ సభ్యులు అందజేశారు. వాటి విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని తెలిపారు. వాటిని దర్గా ముజావర్లు సుబహాని, హిదయతుల్లాకు అందించారు.

ఘనంగా డిగ్రీ కళాశాల వార్షికోత్సవం


సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

సూళ్లూరుపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం 44వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకరశర్మ మాట్లాడుతూ కళాశాలలో ఫిజిక్స్ హానర్స్, బీకాం హానర్స్, పీజీలో జువాలజీ, ఎకనామిక్స్, కెమిస్ట్రీ, ఎంకాతో పాటు ఫిజిక్స్ హానర్స్ కోర్సులు ప్రారంభించినట్టు తెలిపారు. విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణిస్తున్నారని గుర్తు చేశారు. అలాగే జేకేసీ ద్వారా వందశాతం మంది ఉద్యోగాలు సాధించారని, ఎన్‌సీసీ విద్యార్థులు ట్రెక్కింగ్ అండ్ కల్చరల్ ప్రోగ్రామ్స్‌లో పాల్గొంటున్నారని తెలిపారు. డిగ్రీ, పీజీ విద్యార్థులకు సివిల్స్ పోటీ పరీక్షలకు కోచింగ్ ఇస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోనే అత్యుత్తమ కళాశాలగా ఏ గ్రేడ్ సర్టిఫికెట్ పొందామని, విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియారాణి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ బి.రాజా, అధ్యాపకులు ఆర్ శరత్‌బాబు, గౌరీ శంకర్, బి.శ్రీనివాసులు, అకాడమిక్ కో ఆర్డినేటర్ డి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.